క్లుప్తంగా

టూటౌన్ సీఐగా రాజారెడ్డి



ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన సీఐ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ టూటౌన్ సీఐగా రాజారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ సాధారణ బదిలీల్లో భాగంగా తనను కడప నుంచి నంద్యాలకు ఉన్నతాధికారులు బదిలీ చేశారని చెప్పారు.

రేపు పింఛన్ కానుక పంపిణీ

ఉయ్యాలవాడ : మండలంలో ఈ నెల 6వ తేదీన వైఎస్సార్ నూతన పింఛన్ కానుకను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో నూతనంగా 67 పింఛన్లు మంజూరు కాగా ఆర్.జంబులదిన్నె సచివాలయానికి 15, బోడెమ్మనూరు 6, కొండుపల్లె 12, హరివరం 2, మాయలూరు 3, సుద్దమల్లకు 3, పెద్దయమ్మనూరు 7, తుడుమలదిన్నె 7, అల్లూరు 1, ఇంజేడు 5, ఉయ్యాలవాడ 6 చొప్పున కొత్త పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ వివరించారు.

దొర్నిపాడులో నేడు..
దొర్నిపాడు: మండలకేంద్రం దొర్నిపాడులో శుక్రవారం వైఎస్సార్ నూతన పింఛన్ కానుకను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి గురువారం తెలిపారు.

క్రిష్టిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష
రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం క్రిష్టిపాడు గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు 12న డబ్ల్యూ గోవిందిన్నె, 23న గుండుపాపల, 30న కొండాపురం, ఫిబ్రవరి 9న చాకరాజువేముల, 13న బుర్రారెడ్డిపల్లె, 23న దొర్నిపాడు-2 సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

గ్రామ సభల్లో అభ్యంతరాల స్వీకరణ

రుద్రవరం: రెండో విడత భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామని ఏవైనా అభ్యంతరాలు ఉంటే రైతులు తెలపాలని తహసీల్దారు రవీంద్ర ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో రెండో విడత కింద టీ.లింగదిన్నె,శ్రీరంగాపురం, చిలుకలూరు,మందలూరు గ్రామాల్లో భూ రీ సర్వే నిర్వహించి హద్దు రాళ్లు పాతామన్నారు. అయితే ఎక్కడైన ఏవూనా పొరబాటు జరిగి ఉంటే సరిదిద్దేందుకు ఈ నెల 5న టీ.లింగందిన్నె, 6న శ్రీరంగాపురం, 8న చిలుకలూరు, 9న మందలూరులో గ్రామ సభలు నిర్వహిస్తామని అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేసుకోవచ్చని చెప్పారు.

చాగలమర్రిలో..
చాగలమర్రి: మండలంలో భూ రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో కొలతలకు సంబంధించి సమస్యలుంటే ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు అప్పీలు చేయవచ్చని రీసర్వే డీటీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి ఈ నెల 16వ తేదీ వరకు అప్పీలు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 5వ తేదీన స్థానిక సంత మార్కెట్‌లోని సచివాలయ కార్యాలయంలో, 6న మల్లెవేముల, 8న ఉదయం 10.30 గం.లకు చిన్నవంగలి, సాయంత్రం పెద్దవంగలిలో, 9న ఉదయం డి.వనిపెంట, అనంతరం ముత్యాలపాడులో గ్రామ సభలు నిర్వహిస్తామని వివరించారు.

పింఛన్ పంపిణీ



నంద్యాల ఆసుపత్రిలో అనుమక్కకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చెరుకు శ్రీదేవి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. పంపిణీ కార్యక్రమం గురువారం కూడా కొనసాగింది. పెంచిన రూ.3వేల సొమ్మును లబ్ధిదారులకు అందజేసినట్లు గృహ సారథి గోవిందరాజు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఆలమూరులో గిరిజనులతో ఐటీడీఏ అధికారులు

రుద్రవరం: గూడెంలో నెలకొన్న సమస్యలతో పాటు వ్యవసాయం చేసుకునేం దుకు భూమి ఇప్పించేందుకు కృషి చేస్తామని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ రవీంద్ర రెడ్డి తెలిపారు. మండలంలోని ఆలమూరు గ్రామం అంకాలమ్మ చెంచుగూడెంను గురువారం సందర్శించారు. వారు మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలని సూచించారు. తమకు వ్యవసాయం చేసుకునేందుకు భూమి లేదనడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏఈ లత, అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేజీ నాయక్,ఆధార్ సమన్వయకర్త కమృద్దీన్ ఉన్నారు.

- అభివృద్ధి బాటలో దొర్నిపాడు సహకార సంఘం
- 2018 వరకు రైతులకు రూ.2.50 కోట్లు..ప్రస్తుతం రూ.15కోట్ల రుణాలు
- 80 ఏళ్లలో లేని అభివృద్ధి ఐదేళ్లలో చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- నాడు 70 శాతం రుణాల రికవరీ... నేడు 98 శాతం
- సంఘం పరిధిలో నాలుగు గోదాముల నిర్మాణం



ఈ నూతన భవనంలో భద్రతా ప్రమాణాలతో కూడిన సేఫ్ లాకర్, బీరువా వంటి వాటిని ఏర్పాటు చేశారు. అలాగే ప్రెసిడెంట్‌కు ప్రత్యేక గదితో పాటు రికార్డులు భద్రపచుకునేందుకు మరో గదిని నిర్మించారు. రుణాలు పొందేందుకు ప్రత్యేక కౌంటర్లను సిద్ధం చేశారు. గతంలో అధ్యక్షుడు కూర్చోవడానికి కాసింత స్థలం కూడా ఉండేది కాదు. సొసైటీ గోదాంలోనే ఒక వైపు కుర్చీలు, టేబుల్ వేసుకొని కాలం వెళ్ల దీశారు. నూతనంగా సింగిల్ విండోచైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన భూమా చెంచిరెడ్డి సహకార సంఘం అభివృద్ధికి కృషి చేశారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న బహుళ ప్రయోజన సౌకర్య గోదామును సహకార సంఘం ఆవరణలో రూ.40 లక్షలతో నిర్మించారు. 500 మెట్రిక్ టన్నుల ధాన్యం పట్టేలా ప్రభుత్వం నిర్మించింది. అలాగే సహకార సంఘం పరిధిలోని క్రిష్టిపాడు, డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల్లో 500 మెట్రిక్ టన్నుల విలువజేసే రూ.1.20 కోట్లతో మూడు గోదాములు, అలాగే చాకరాజువేముల గ్రామంలో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాంను రూ.80 లక్షలతో నిర్మించారు.

కొండంత సహకారం

దొర్నిపాడు: సహకార సంఘాలపై రైతులకు నమ్మకం పోయిన వేళ వైఎస్సార్ వాటికి జవసత్వాలు తీసుకొచ్చారు. ఆయన తరువాత వచ్చిన పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రాభవం కోల్పోయాయి. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సొసైటీల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 1941 జనవరి 17న ప్రారంభమైన దొర్నిపాడు సహకార సంఘం రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం రైతులకు కొండంత అండగా మారి సేవలందిస్తోంది. ఈనెల 6న సొసైటీ నూతన భవనాన్ని సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి అధ్యక్షతన ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభించనున్నారు.

సేవలు ఇలా..
- రైతులకు బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనాలపై రుణాలు ఇచ్చేందుకు నూతన కార్యలయాన్ని రూ.28.62 లక్షలతో నిర్మించారు.
- సొసైటీ ప్రారంభం నుంచి 2018 వరకు 504 మంది రైతులకు రూ.2.50కోట్లమేర రుణాలుఅందజేశారు.
- 2019 నుంచి 590 మంది రైతులకు రూ.15కోట్ల రుణాలు ఇచ్చారు. ఐదేళ్లలో సహకారం సంఘం అభివృద్ధి చెందిందనడానికి ఇదే నిదర్శనం.
- రైతులకు అవసరమైన అన్ని రకాల రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వాటిని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు రైతులకు అందిస్తున్నారు.
- నూతన భవనంలో రైతులకు లాకర్ సౌకర్యం ఏర్పాటు చేశారు.
- రూ.3లక్షల వరకు క్రాప్ లోన్స్, రైతు నేస్తం కింద రూ.10లక్షలు, రాజన్న చేయూత కింద రూ.3లక్షల వరకు రుణాలు ఇస్తున్నారు.
- బర్రెలు, గొర్రెలు, మేకలు, ట్రాక్టర్లు, పైప్‌లైన్స్, మోటార్లు, కోళ్ల పెంపకం, పండ్లతోటలు, బోర్లు తదితర వాటిపై రుణాలిస్తున్నారు.
- గతంలో రుణాల రికవరీ శాతం 70 శాతం ఉండగా.. ప్రస్తుతం 98శాతానికి చేర్చారు. ఇందుకు రుణాల చెల్లింపుపై రైతులకు అవగాహన కల్పించడం, తిరిగి చెల్లించేలా చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిచ్చాయి.



ఈ సీసీరోడ్డు దొర్నిపాడులోని ప్రధాన రహదారి నుంచి సొసైటీకి వెళ్లేందుకు రూ.15లక్షలతో నిర్మించారు. సొసైటీ ఏర్పాటైనప్పటి నుంచి ఇంత వరకు మట్టిరోడ్డులోనే రాకపోకలు సాగించేవారు. ఈ రహదారి ఏర్పాటు సొసైటీతో పాటు రెండు సచివాలయాలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలకు ఉపయోగకరంగా మారింది. ప్రస్తుతం రైతులు సహకార సంఘం నుంచి ఎరువులు, ధాన్యం, సబ్సిడీ విత్తనాలు తెచ్చుకోవడానికి ఇబ్బందులు తప్పాయి.

సొసైటీకి వెళ్లేందుకు రూ.15లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు

పంట రుణం ఇచ్చారు



నేను సహకార సంఘంలో పంట పెట్టుబడుల కోసం రూ.4లక్షల రుణాలు పొందాను. ప్రతి సంవత్సరం ఏడాది లోపు రుణాలను రెన్యూవల్ చేసుకుంటున్నా. ప్రభుత్వం కూడా తిరిగి వడ్డీ మాఫీ చేస్తుంది. ఎలాంటి ఒత్తిడి లేకుండా రుణాలు తీసుకోడం, చెల్లిస్తున్నా.
-శ్రీరాములు, దొర్నిపాడు

30 ఏళ్ల నుంచి రుణం తీసుకుంటున్నాం



మానాన్న తరం నుంచి మా కుటుంబం దొర్నిపాడు సొసైటీలో రుణాలు పొందుతున్నాం. రుణాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏటా రెన్యూవల్ చేస్తున్నాం. ఇప్పటి వరకు ఎలాంటి పొరపాటు రాలేదు. వడ్డీ కూడా తక్కువగానే ఉండటంతో సొసైటీలో రుణం తీసుకుంటున్నాం.
– గద్దం ఏసుపాదం, సొసైటీ మాజీ డైరెక్టర్

సహకార సంఘం అభివృద్ధే లక్ష్యం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 80 ఏళ్లలోని లేని అభివృద్ధిని ఐదేళ్లలో చేసి చూపించాం. సొసైటీ పట్ల రైతులకు నమ్మకం కల్పించి రూ.2.50 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు రుణాలను పెంచాం. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పూర్తిగా పరిష్కరించి రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం. ఇంతటి అభివృద్ధి నా సమయంలో జరగడం సంతోషంగా ఉంది. –భూమా చెంచిరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్, దొర్నిపాడు

మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యే రవికి ధన్యవాదాలు



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల(సెంట్రల్): రాయలసీమ సాగునీటి హక్కుల పోరాటానికి మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సిద్దేశ్వరం అలుగు శంకుస్థాపన సందర్భంగా 2016లో టీడీపీ ప్రభుత్వం నమోదు చేసిన కేసులో రిమాండు నుంచి విడుదలైన సందర్భంగా గురువారం పట్టణంలోని సమితి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీమ సాగునీటి, మౌలిక వసతుల సాధనకు రాజకీయాలకు అతీతంగా పోరాడుతున్న రైతు సంఘాల నిబద్ధతను గుర్తిస్తూ ఎమ్మెల్యే రవి మాట్లాడటం హర్షణీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని వేరేచోటికి తరలించకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కృష్ణా జలాల పునఃపంపిణీపై తెచ్చిన చీకటి చట్టం వల్ల కలిగే నష్టాల్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే హామీనివ్వటం సంతోషకరమన్నారు. సిద్దేశ్వరం అలుగు, గుండ్రేవుల రిజర్వాయర్, తుంగభద్ర వరద కాలువ, వేదవతి ఎత్తిపోతల నిర్మాణాల్ని అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. తన అరెస్ట్ సందర్భంగా మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. సమితి ఉపాధ్యక్షులు వైఎన్ రెడ్డి, యాగంటి బసవేశ్వర రైతు సంఘం నాయకులు కొండారెడ్డి, గడివేముల మండల రైతు నాయకులు ఈశ్వర్‌రెడ్డి, సౌదాసాగర్ ఖాసీం, కుందూ పరిరక్షణ సమితి నాయకులు రామచంద్రారెడ్డి, పట్నం రాముడు, భాస్కర్‌రెడ్డి, కొమ్మా శ్రీహరి, తిరుపాల్ యాదవ్, మహిపాల్‌రెడ్డి, షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష క్యాంపులు పకడ్బందీగా నిర్వహించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: అన్ని మండలాలలో నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ ఏపీ సెక్రటేరియట్‌లోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి ఆరోగ్యం, వైద్యం - కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, స్త్రీ - శిశు సంక్షేమం, అంగన్‌వాడీల పనితీరు, రీసర్వే మూడవ దశ, ఇనామ్–అసైన్డ్ భూములు, కరువు, పీ-ఆర్డీ, ఎన్ఆర్ఈజీఎస్ – కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, జల్ జీవన్ మిషన్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పుల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ సద్వినియోగం చేసుకొనేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. మూడవ విడతలో చేపట్టిన రీసర్వే పనులను వేగవంతం చేసి స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ సేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని చెప్పారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి



వస్త్రాలను అందజేస్తున్న డీఎస్పీ మహేశ్వర రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): అంధులు క్రీడల్లోను, చదువులో ఉన్నత స్థానాల్లో ఉండి ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి అన్నారు. గురువారం రామకృష్ణారెడ్డి కళాశాలలోని వివేకానంద ఆడిటోరియంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు, స్పందన బ్లైండ్ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ప్రసాదరెడ్డి నూతన వస్త్రాలను ఉచితంగా దివ్యాంగులకు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణవేణి,లక్ష్మీకాంతరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు మస్తాన్‌వలి, మరియదాసు, జహరుద్దీన్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ దస్తగిరి, లింగారెడ్డి పాల్గొన్నారు.
నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని క్రాంతినగర్‌లోనున్న జీవన జ్యోతి అంధుల పాఠశాలలో 12వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీరామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి జీవనజ్యోతి అంధుల పాఠశాల విద్యార్థులకు రూ.30వేలు విలువజేసే వస్త్రాలను పంపిణీ చేశారు. అలాగే అర్పిత రూ.25వేలు, జగదీష్ అంధులకు మంచినీటి కోసం రూ.15వేలు అందజేశారు. సాగర్, శంకర్, శివశంకర్‌లు భోజన వసతి ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై నివేదికలివ్వండి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ఆళ్లగడ్డ : అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి కనీస వసతులపై నివేదికలు అందజేయాలని నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని అధికారులు పరిశీలించి విద్యుత్, నీటి సరఫరా, ఫర్నీచర్, మరుగుదొడ్లు, ర్యాంపు నిర్మాణంపై నివేదికలు పంపాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా అందుబాటులో ఉన్న సౌకర్యాలు, చేపట్టవలిసిన పనులు ఉన్నాయా గుర్తించాలని తెలిపారు.

ముగిసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర
ఉయ్యాలవాడ : మండలంలోని గ్రామ పంచాయతీల్లో గత ఏడాది డిసెంబర్ 26న ప్రారంభమైన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు ముగిశాయి. ఆర్.పాంపల్లెలో ప్రారంభమైన యాత్ర గురువారం కాకరవాడ, పుచ్చకాయలపల్లె గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలతో ముగిసింది. ఈ సందర్భంగా పలువురికి ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. సర్పంచ్‌లు రామమోహన్, మధుసూధనాదేవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, ఏపీఓ రవిప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్‌బాబు, లక్ష్మీసువర్ణ పాల్గొన్నారు.

అయోధ్య అక్షితల పంపిణీ
గోస్పాడు: అయోధ్య రామయ్య అక్షితలను మండల కేంద్రంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. గురువారం గ్రామంలో అయోధ్య కరసేవకులు రాజేష్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రామమందిర చిత్రపటం, అక్షితలతో ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ తిరిగి అందజేశారు. ఏపీపీ వివేకానందరెడ్డి, దేవనాథరెడ్డి, సుబ్రహ్మణ్యం, సుదర్శన్, భవానీ పాల్గొన్నారు.

పింఛన్ పెంచి హామీ నెరవేర్చాం





పింఛన్ల పంపిణీలో పాల్గొన్న లబ్ధిదారులు ,రుద్రవరంలో లబ్ధిదారుడికి కొత్త పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల

రుద్రవరం: ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము పెంచి మాట నిలబెట్టుకున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు వివిధ రంగాల్లో అభివృద్ధిని సాగిస్తూ జగనన్న దేశంలోనే ఆదర్శంగా నిలిచారన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన ఎంపీడీఓ మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో కొత్త పింఛన్ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లబ్ధిదారులకు కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో కొత్తగా మంజూరైన 103 మందికి రూ.3వేల ప్రకారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పింఛన్ సొమ్ము అంచెలంచెలుగా పెంచి రూ.3వేలకు తీసుకెళ్తామని జగనన్న హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ మేరకు ఈనెల నుంచి పింఛన్‌ను రూ.3వేలకు పెంచి అందజేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ఇన్ని రకాలుగా సాయమందిస్తోంటే అది ఓర్వలేక ప్రతి పక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు జగనన్న అందిస్తున్న పథకాల మాదిరిగానే మరింత పెంచి ఇస్తామని చెబుతున్న టీడీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇవ్వలేదని, అప్పుడు ప్రకటించిన మేనిఫెస్టోను ఎందుకు అమలు చేయలేక పోయారో ఇళ్లవద్దకు వచ్చినప్పుడు వారిని నిలదీయాలని ప్రజలకు సూచించారు. గతంలో అహోబిలానికి వెళ్లాలంటే భక్తులు నరక యాతన పడేవారని ఆ సమస్య తీర్చేందుకు కొత్తగా తారు రోడ్డు వేయించామన్నారు. అలాగే రుద్రవరం నుంచి అప్పనపల్లె , పెద్దకంబలూరు మీదుగా మెట్ట వరకు దాదాపు రూ.4కోట్లతో తారు రోడ్డు వేయించామని, ఇంది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో రూ.20లక్షలతో సీసీరోడ్లు వేస్తున్నామని ఇలా చెప్పుకుంటూ పోతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించిన ఘనత ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గందం రాఘవరెడ్డి, పుట్లాలమ్మ క్షేత్ర డైరెక్టర్ గంగిశెట్టి తిమ్మయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు మదార్ సాహెబ్, నాయకులు కృష్ణారెడ్డి,సుదర్శన్‌రెడ్డి, సోమశేఖర్ రెడ్డి,శీలయ్య, తిరుపతి రెడ్డి.దేవగుడిజాకీర్, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్ర,కొల్లం పుల్లయ్య,గఫూర్ సాహెబ్, నాగముని, మధు, శ్రీనివాసరెడ్డి,ఎర్రన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు సన్మానం

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం ఉన్నత పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని (సావిత్రీబాయి పూలే జయంతి) పురస్కరించుకొని గురువారం ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) అధ్యక్షుడు నాగరాజు ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించారు. భాగ్యనగరం పాఠశాలకు చెందిన వహిదా, క్రిష్టిపాడు ఎంపీయూపీ పాఠశాలకు చెందిన ఓబులమ్మను సన్మానించి జ్ఞాపిక అందజేశారు.హెచ్‌ఎం ఆదిలక్ష్మి,ఉపాధ్యాయులు సురేష్, ఓబులేసు, రహీమ్, గంగాధర్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల పరిశీలన

నంద్యాల(సిటీ): పట్టణంలో టౌన్ ప్లానింగ్ పరిధిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను గురువారం విజిలెన్స్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి, విజిలెన్స్ అధికారి వెంట రాగా పట్టణంలోని రైల్వేస్టేషన్, పద్మావతినగర్, బస్టాండ్, సంజీవనగర్ తదితర ప్రాంతాల్లో నిర్మించిన పలు కట్టడాలను తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లో రెసిడెన్షియల్ నిర్మాణానికి అనుమతులు తీసుకుని కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించడం, సెట్ బ్యాక్‌లు లేకపోవడం, జీప్లస్ టూ కింద అనుమతులు పొంది అదనపు అంతస్తుల నిర్మాణం, నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేసిన వాటిపై గతంలో ఫిర్యాదులు రావడంతో పరిశీలనకు వచ్చామని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పరిశీలనలో టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్ రిజ్వానా ఉన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలి

నంద్యాల(సిటీ): గత నెల 26వ తేదీ నుంచి నంద్యాల మున్సిపల్ పారిశుద్య నిర్వహణలో ఆప్కాస్ ద్వారా పని చేస్తున్న 324 మంది సమ్మెబాట పట్టడంతో పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం కాకుండా ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి తాత్కాలికంగా ఇప్పటికే 50 మంది కార్మికులను తీసుకున్నామన్నారు. మరో వంద మందిని రోజువారి వేతనంతో తీసుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సిబ్బంది కొరత ఉన్నందున కొంత మేర వాహనాలు ఆలస్యంగా వచ్చినా చెత్త తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): విశ్వసనీయతకు అర్థం చెబుతూ పింఛన్ల పెంపు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జేసీఎస్ పట్టణ అధ్యక్షుడు సన్నల సాయిరాంరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 15వ వార్డులో పెంచిన రూ.3వేలు పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందించి, వారితో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కౌన్సిలర్ సన్నల అనూష ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాయిరాం రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం అవ్వాతాతలు మండల కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అలాంటి అవస్థలు తప్పాయని, ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నామని చెప్పారు.

సంక్షిప్తం

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి
ఉయ్యలవాడ: ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన మల్లు సుబ్బరాయుడు (65) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు గతేడాది డిసెంబర్ 29న కోవెలకుంట్ల మండలం గుళ్లగూర్తి గ్రామంలో ఒక రైతు వద్ద మేకను కొనుగోలు చేసి మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. మండలంలోని మాయలూరు పెట్రోల్ బంక్ వద్ద అదుపు తప్పి కిందపడి తలకు తీవ్రమైన గాయమైంది. చికిత్స నిమిత్తం జమ్మలమడుగుకు తరలించగా అక్కడి వైద్యులు కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య మల్లు లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.
దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన సూరబోయిన నడిపి సుబ్బరాయుడు(55) అనే రైతు కోలేకోలేక గురువారం మృతి చెందాడు. ఈనెల 2న పొలం పనుల నిమిత్తం కాడెద్దులతో పొలం వెళ్లాడు. ఎద్దులకు నీళ్ల తాపే సమయంలో ఓ ఎద్దు రైతును పొడిచింది. కర్నూలు వైద్యశాలలో కోలుకోలేక గురువారం మృతి చెందాడు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మౌలాలి తెలిపారు.

నూతన సంవత్సర కానుకగా పింఛన్ పెంపు
గోస్పాడు: నూతన సంవత్సర కానుకగా పింఛన్ లబ్ధిదారులందరికీ ప్రభుత్వం పింఛన్‌ను పెంచిందని ఇరిగేషన్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ప్రహ్లాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సచివాలయంలో గురువారం పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ అనసూయ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పిల్లలు బడిలోనే ఉండాలి
గోస్పాడు: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈఓలు అబ్దుల్‌కరీం, సురేంద్రనాథ్ సూచించారు. స్థానిక కస్తూర్బా విద్యార్థినులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. 5 నుంచి 18 సంవత్సరాల్లోపు వారు తప్పని సరిగా బడుల్లోనే ఉండాలన్నారు.

గంగన్నకు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు
నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును 2023 సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఈనెల 3న కాకినాడలో అందజేశారని నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి గంగన్న గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలను గుర్తించి కాకినాడ ఎంపీ యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పూలేప్రసాద్, మల్లి ఆధ్వర్యంలో అవార్డు అందుకున్నట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలి
నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మున్సిపల్ కార్యాలయం నుండి సంజీవనగర్ గేటు వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చింతలమోహన్‌రావు మాట్లాడారు.

ఆడుదాం ఆంధ్రతో ప్రతిభ వెలికితీత
గోస్పాడు: క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంపీడీఓ అనసూయ చెప్పారు. గురువారం దీబగుంట్ల హైస్కూల్ ఆవరణలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించగా మహిళలు పాల్గొన్నారు.